
# నిన్న నిన్నగా...



వారణాసి ప్రసాదరావు

ఆదివారం—

బాలయ్య వచ్చి చెప్పాడు ఎవరో ఓ స్త్రీ... ఓ కుర్రాడు తనకోసం వచ్చారని ...టిఫిన్ ముగించి డ్రాయింగురూంలోనికొచ్చి చూసిన కృష్ణగోపాల్ మరుక్షణం తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు!

"నిర్మలా!..." అప్రయత్నంగా పలికింది అతని గొంతు. ఆమె చిన్నగా నవ్వుతూ చేతులు జోడించి నమస్కరించింది. "బాగున్నారా" అంది...ఆమె కళ్ళల్లో ఇక కనిపించదన్న తన వస్తువేదో మళ్ళీ కనిపించిన తృప్తి వుంది... ఆ వెనుకగా మరేదో అర్థింపూ వున్నది.

సరిగ్గా ఆ క్షణాన...

'మళ్ళీ యిన్నాళ్ళకు కనిపించావా... యిలా అయిపోయావేం... యింతకాలం ఎక్కడెక్కడ వున్నావ్... యీ కుర్రాడెవరూ... అసలు నే నిక్కడ వున్నట్టు ఎవరు చెప్పారు... ఏదయినా పనిమీద వచ్చావా?' వరసగా అన్నీ అడిగెయ్యాలనుకున్న తన ఆత్రాన్ని తక్షణ కర్తవ్యం గుర్తుకొచ్చి అణిచెయ్యడంతో నిటూర్చాడు కృష్ణగోపాల్.

ఆమె అడిగిన ప్రశ్నకు అవునని తల పంకించి తను కూర్చుంటూ ఆమెను కూర్చోమన్నాడు.

వేసవి- ఉదయాన్నే తన ప్రతాపాన్ని చూపిస్తోంటే కూలర్ ఆన్ చేసి బాలయ్యను పిలిచాడు. బాలయ్య తన యజమాని భావాన్ని అర్థంచేసుకుని కదిలాడు.

గెస్ట్ ఫార్మాలిటీస్ అయ్యాయి!

ముందుగా ఆమె తను వచ్చిన పని వివరించింది. కృష్ణగోపాల్ ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూసాడు. కారణాలడిగాడు. ఆమె ఆ అన్నిటికీ జవాబులు చెప్పింది నమ్రతగా. చెపుతూ తన చేతి బ్యాగ్ లోంచి ఓ పాస్‌పోర్టుసైజు ఫోటోను తీసింది... "ఈయనే మావారు" అంది దాన్ని అందిస్తూ. మామూలుగా అందుకున్న కృష్ణగోపాల్ దాన్ని చూసి అదిరిపడ్డాడు. కొన్ని క్షణాలవరకూ కళ్ళకు

చీకట్లు కమ్ముకున్నట్టయింది... మరేదో జడత్వం ఆవహించినట్టు అన్పించింది.

నిర్మల తననే గమనిస్తూ వుండటాన్ని చూసిన కృష్ణగోపాల్ తన భావాలకు తెరవేసి తనను తాను కంట్రోల్ చేసుకోసాగారు. అందుకోసం కొన్ని క్షణాలు ఏదో ఆలోచిస్తున్నట్టుగా మౌనంగా వుండిపోయాడు. ఆరేళ్ళ ఆ కుర్రాడు పక్కనున్న టీపాయ్‌లోని అందమైన ప్లాస్టిక్ పువ్వుల్ని తాకాలని ప్రయత్నిస్తోంటే ఆమె వాడ్ని వారిస్తోంది. వాడి కళ్ళలో ఎదుటి వస్తువుల కాంతి తప్ప సహజకాంతి లేదు. ఆమె ముఖాన అరుణ వర్ణపు బొట్టుతప్ప సజీవకళ లేదు. ఆమె తన మునుపటి నిర్మల కాదు. యాంత్రిక సంసారంలో ఓ మర... మధ్యతరగతి మిధ్యా బ్రతుకుల్లో నిజాన్ని వెతికే ఓ అన్వేషి... తన ఉనికినీ, స్థితినీ తెలుసుకుని సహాయంకోసం తన దగ్గరకు వచ్చింది. తను అవునంటే ఆనందంతోనూ... కాదంటే కన్నీళ్ళతోనూ వెనుతిరిగిపోతుంది. ఏదో అడగాలనుకున్న ప్రయత్నంలో పక్కగదిలోంచి ఫోన్ రింగయింది. ఒక్క నిముషం— లేచి లోనికి వెళ్ళాడు కృష్ణగోపాల్.

నిర్మల ఆ గదినంతా పరిశీలనగా చూసింది. గదంతా స్వచ్ఛతకు, ప్రశాంతతకూ చిహ్నంగా వుంది. అంతకు మించి గంభీరంగా వుంది. ఓ పక్కగా పుస్తకాల బీరువా, దానిపై కృష్ణగోపాల్ ఫోటో వుంది. కృష్ణగోపాల్ ఇంకా ఒంటరిగానేవున్నాడా? ఆమెలో సందేహం మొలకెత్తింది. కృష్ణగోపాల్ తిరిగి వచ్చాడు అంతలో—

"క్షమించు నిర్మలా! అర్జంటుగా బయటకు వెళ్ళాల్సిన అవసరంవచ్చింది. ఎన్నో విషయాలను అడగాలనుకున్నాను. ఇంకెన్నో చెప్పాలనుకున్నాను. కానీ..."

చెపుతోన్న కృష్ణగోపాల్ మాటలకు మధ్యలోనే అడ్డుకుందామె. "ఫర్వాలేదండీ- మీ విలువయిన టైంను వృధా చేస్తున్నందుకు నేనే సారీ చెప్పాలి... మీరు చేయబోయే సహాయానికి జీవితాంతం ఋణపడి వుంటాం" చెపుతూ మళ్ళీ చేతులు జోడించింది.

ఆమె మాటలతీరు నవ్వు తెప్పించబోయింది. మన మధ్య ఇంతలేసి మాటలెందుకు నిర్మలా— అనాలనుకున్నా తనకు ఏ తెర అడ్డుగా నిలిచిపోయిందో— నవ్వును అదిమిపట్టాడు కృష్ణగోపాల్.

ఆమె పిల్లోడ్ని తీసుకుని కదిలింది.

"నిర్మలా!" పిలిచాడు కృష్ణగోపాల్.

ఆమె గుమ్మందగ్గర ఆగి వెనుతిరిగింది. "ఎల్లుండి కదా ఇంటర్వ్యూ... రేపు సాయంత్రం మీ వారిని తీసుకుని ఇక్కడకు రా. కొన్ని విషయాలు మాట్లాడాలి." అన్నాడు.

ఆమె ఓ క్షణం సంశయిస్తున్నట్టుగా ఆగింది...తర్వాత మెల్లిగా నిట్టూరుస్తూ

"ఆలాగే... తప్పకుండా" అంది కృతజ్ఞత... ఆశ... నిండిన స్వరంతో।

* * *

ఆ రాత్రి రెండోజామున ఇంటికి చేరుకున్న కృష్ణగోపాల్‌కు మిగిలిన రాత్రి కలతనిద్ర ఊయలూపింది। గతం జోల పాడింది. మూర్ఖత్వం... జులాయితనం మూర్తీభవించిన నాగరాజు తాము అద్దెకుండే ఇంటికి యజమాని కొడుకే కాదు, తన సహాధ్యాయి కూడా. పోస్ట్‌మాన్‌గా తన తండ్రి సంపాదించేది తన తల్లి అనారోగ్యానికీ, అక్క పెళ్ళికి చేసిన అప్పుల పై వడ్డీకి చెల్లయ్యేది...ఓ రోజు పరిస్థితి విషమించిన తల్లిని ఆస్పత్రిలో చేర్చేందుకు డబ్బు అవసరమయి మనీ ఆర్డర్ల సొమ్ము వినియోగించాడు. మళ్ళీ ఆ డబ్బును సకాలంలో సర్దుబాటు చేయని కారణంగా తండ్రి ఉద్యోగం వూడింది. తల్లి పరిస్థితి విషమించి కన్ను మూసింది ...తల్లి కర్మకాండలు పూర్తయ్యే వరకయినా ఆగలేదు నాగరాజు తండ్రి... నాల్గునెలల అద్దెను వస్తురూపంగా జమ కట్టుకుని మిగిలిన ముంతాముతకా బయట పారేయించాడు...తండ్రి ఎంతగానో ప్రాధేయపడ్డాడు.ఫలితం శూన్యం। తను నాగరాజును వేడుకున్నాడు: ఫలితం అంతే। రోడ్డుమీదకొచ్చింది తమ బ్రతుకు... కొద్ది నెలల్లోనే తండ్రి మంచానపడి తల్లిని చేరుకున్నాడు తను మిగిలాడు ఒంటరిగా... తండ్రికి రావాల్సిన డిపార్టుమెంటు సొమ్ము కొద్దిగా వచ్చింది. వారసుడిగా అందుకున్నాడు తను. పేదరికాన్ని మించిన శత్రువు మనిషికి మరొకటి లేదు. ఈ ప్రపంచమంతా ధనమయం...ధనంతోనే హోదా, గౌరవం, విలువ అన్నీ. అవి ఏనాటికయినా తను సాధించగలడా....సాధించి తీరాలి। ధృఢనిర్ణయం తీసుకున్నది ఆ రోజునే। ఆ రోజున తనవద్ద మిగిలివున్న సొమ్ము ఎంతో కాలం నిలువదు... ముందుగా ఏదయినా చిన్న వుద్యోగం చూసుకోవాలి. డిగ్రీపరీక్షలు పూర్తయిన తర్వాత విశాఖ వెళ్ళిపోయాడు. తన దీన గాథ చెప్పుకుని ఓ క్లాత్ మర్చెంట్ దగ్గర గుమస్తాగా కుదిరాడు. రోజులు గడిచేందుకు చాలు... ఆ ఉపాధి। తనొక్కడూ ఓ గదిలో అద్దెకుండేవాడు. ఇంటివారమ్మాయి నిర్మల... నిర్మలమయిన ఆమె అందం, నడవడీ తనకెంతో ఇష్టమయ్యేవి. యవ్వన సహజంగా ఓ స్త్రీ గురించిన ఆలోచనలు తనలో నిర్మల పరిచయంతోనే మొదలయినయ్...రోజులు గడిచేకొద్దీ తమ పరిచయం ప్రణయంగా మారిందని తెలియకనే తెలిసివచ్చింది। తెలిసి లతలయి పెనవేయసాగింది।

మళ్ళీ ఆశనిపాతమే।

ఆ చిన్న ఉద్యోగమూ ఊడింది. 'నిన్ను చేసుకుని మా పిల్ల ఏం సుఖపడుతుందయ్యా. వెళ్ళు మరో వారంరోజుల్లో




మరో బస చూసుకుని పో...' హెచ్చరించారు నిర్మల తల్లిదండ్రులు— అడ్డు వచ్చిన నిర్మలపై చెయ్యి చేసుకున్నారు తను విడిచిపోక తప్పింది కాదు। కడుపు చేత పట్టుకుని మరో వూరు మరో పార్టుటైం ఉద్యోగం। ఈసారి తను తన ధ్యేయాన్ని చెక్కుచెదరనివ్వలేదు. ఏ ఆకర్షణకూ లొంగిపోనూలేదు... కృషి-కృషి- కృషి-। అన్నింటా కృషి- తను నమ్ముకున్నదే కృషి।

నిర్మలకు పెళ్లయిపోయిందని తెలిసింది।

ఓ మధురమయిన కల చెదిరిపోయింది।

విచిత్రం... ఆ నిర్మల నాగరాజును భర్తగా పొందిందా...?। జూదం... స్త్రీ వ్యసనాల కారణంగా తనవాటా ఆస్తి— ఇల్లు అన్నీ పోగొట్టుకున్న నాగరాజును సోదరులు ఆదరించకపోవడం- తమను చేరకుండా గెంటివేయడం నిజంగా దేవుడు నేర్పిన గుణపాఠమా- తండ్రితో పాటు అన్నిటినీ పోగొట్టుకున్న నాగరాజుకు సరయిన ఉద్యోగంలేదు-వచ్చిన చిన్నా చిరుఉద్యోగాలను నిలుపుకోలేదు- పొట్ట చేతపట్టుకుని పట్నంరోడ్లు పట్టిన నాగరాజు కుటుంబానికి పూట గడిచే దారి లేదు...। వారి కిద్దరు పిల్లలు...।।

పరాయి రాష్ట్రంలో ఉద్యోగం కుదిరింది తనకు- తన కృషి- విజాయితీల

కారణంగా ఎదిగివచ్చిన తనను స్వంత రాష్ట్రానికి బదిలీచేసి అధికారిగా బాధ్యతలు మోపారు నిర్మల భర్త తను పనిచేసే కంపెనీలో గుమాస్తా ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నాడు.

నిర్మల తనను ఆరాధించిన వ్యక్తి- తన ఆకలిని తెలిసి అన్నం పెట్టిన దయామయి- తన పరీక్షలకు పుస్తకాలకు ఆదుకున్న కరుణామయి- అన్నిటికీ మించి తన ఉన్నతికై ప్రేరణనిచ్చిన ఓ ప్రేమ మయి- ఇప్పుడు తన కుటుంబాన్ని ఆదుకో మని అభ్యర్థిస్తూ వచ్చింది!...

ఓ ప్రక్క- నాగరాజు- మరో ప్రక్క- నిర్మల- ఏం చేయాలి-? ఆలోచనల మధ్య తృటిలో మెరిసిన పథకమది! రేపు వారిద్దరూ రామన్నారు- తన పథకాన్ననుసరించి.

* * *

ఇంటర్వ్యూ అయిపోయింది!

ఆ మరునాడు- ఉదయాన్నే గేట్ తీసుకువస్తోన్న నిర్మలను చూసి ఆహ్వానించాడు కృష్ణగోపాల్.

"రా- నిర్మలా- రా- ముందుగా సారీ చెప్పాలి నీకు. మొన్న మిమ్మల్ని రమ్మన్న నేను మీరు వచ్చేసరికి లేక పోయాను."

నిర్మల పేలవంగా నవ్వింది. "చేయూత అందించినా అందుకునే అదృష్టం మాకులేదు కృష్ణగారూ" అంది.

"ఏమిటి నిర్మలా ఏమిటంటున్నావు?"

"ఆయన ఇంటర్వ్యూకు వెళ్ళనన్నారు."

"కారణం...?"

"ఏంచెప్పమంటారు ఆయన వైఖరిని. అంతా లంచాలమయమనీ- పెద్దపెద్ద వాళ్ళ రికమండేషన్లతో ముందే అన్నీ రిజర్వు అయిపోయి వుంటాయనీ, ఈ ఇంటర్వ్యూలన్నీ ఓ ఫార్సనీ చెప్పి వెళ్ళకుండా మొండికేసారు- ఆయన అంతరంగం ఏమిటో ఇంతవరకూ అర్థంచేసుకోలేక పోయాను కృష్ణగారూ..." చెపుతోన్న ఆమె గొంతు రుద్ధమయింది.

'ఐ.సీ. నాగరాజు వ్యక్తిత్వం- గిల్టీ కాన్షస్‌నెస్ తనకు తెలియనిదేం కాదు.' తనలో అనుకున్నాడు కృష్ణగోపాల్.

"క్షమించండి- మిమ్మల్ని అనవసరంగా శ్రమపెట్టాము వెళ్ళివస్తాను" చేతులు జోడించింది. లేచి నిల్చున్న నిర్మలను చూసి నవ్వాడు కృష్ణగోపాల్. "ఇట్సాల్ రైట్- ఫర్‌గెట్ ది పాస్ట్. చూడు నిర్మలా నీవు టైప్ వగైరా పాసయి వున్నావు కదూ! నాకు తెలిసిన ఓ చిన్న ప్రయివేట్ కంపెనీలో టైపిస్ట్ అవసరం వుంది. ఆ కంపెనీ యజమాని నాకు మిత్రుడు. రేపే నిన్ను వారికి పరిచయం చేస్తాను. మొదటగా ఆరువందల దాకా ఇస్తారు. ప్రస్తుతానికి అదే నేను మీకు చేయగలిగిన సహాయం. వస్తావుగా..." ముగించాడు కృష్ణగోపాల్.

నిర్మలకు ఆశ్చర్యం- ఆనందాలతో

తలమునకలయినట్టయింది।- కళ్ళల్లోనికి నీళ్ళు చిప్పిల్లుతుండగా అప్రయత్నంగా నమస్కరించింది. పిచ్చినిర్మలా— ఈ మాత్రానికేనా అని ఆమె కళ్ళ నీళ్ళను తుడవాలనుకున్న తన కోర్కెను అదిమి పెట్టుకున్నాడు కృష్ణగోపాల్.

నిర్మల వీడ్కోలు తీసుకుంది కృతజ్ఞతా భారంతో.

కృష్ణగోపాల్ తేలికగా నిట్టూర్చాడు.

'పిచ్చినిర్మలా-నీకేం తెలుసు కష్టించి పనిచేసే బుద్ధీ- ఆత్మవిశ్వాసం- శక్తి సామర్థ్యాల కారణంగా పైకివచ్చిన ఈ కృష్ణగోపాల్ అవిశపించిన వారిని సిఫార్సు చేయడనీ- అవి నీ భర్తలో లోపించి వున్నాయనీ- ఆత్మీయురాలి వయిన నీ పరిస్థితిపై జాలీ సానుభూతీ కారణంగా సిఫార్సుచేసి తన వ్యక్తిత్వాన్ని చంపుకోలేడనీ- ఈ సందిగ్ధాన్ని నేనెలా ఎదుర్కోవాలి- ఏం చేయాలి— ఆలోచించిన నాలో ఏంచేయాలో త్రుటిలో మెరిసింది. అందుకు- మిమ్మల్ని రమ్మన్నాను మీరు వచ్చారు. ఈ గదిలో నా ఫొటోని నీ భర్త చూసాడు. అతనికి తెలుసు నేనెవరినో।-అతనికి ఖచ్చితంగా తెలుసు నేను సిఫార్సు చేయనని। గిల్టీగా, నెగటివ్‌గా ఎప్పుడూ ఆలోచించే నీ భర్త నేను అన్నీ మరిచి మంచి మనసుతో సిఫార్సు చేస్తానని చెప్పినా నమ్మే వ్యక్తి కాదు నిర్మలా- కానేకాదు...।

'అలా నీ కారణంగా ఏర్పడ్డ మానసిక సందిగ్ధంలోంచి ఎలా నేర్పుగా బయట పడ్డానో నీకు తెలియకపోవడమే మంచిది। లెటిట్- కానీ ఆర్థిక కారణాలతో నీ సంసారం ఒడిదుడుకులకు లోనుకాకూడదు... అందుకే అర్హత కలిగిన నీకు తగిన ఉపాధికి సిఫార్సు చేస్తున్నాను నిర్మలా- నిజానికి నీ భర్తకు ఉద్యోగం వచ్చేదానికన్నా నీకు రావడమే మేలు— ఎలా అంటావు కదూ? ఉద్యోగంచేసి డబ్బు సంపాదించే నీ భర్త మీ కుటుంబం కన్నా మిన్నగా తన వ్యసనాలను చూసుకుంటాడు. వాటినే పెంచి పోషించుకుంటాడు. ఇంతవరకూ నిలిచిన నిజం అదే కదూ.-ఆ కారణంగా అతనికి ఇల్లాలుగా మాత్రంకాదు బ్రతికి చెడిన ఓ స్త్రీగా- ఇద్దరు పిల్లలకన్న తల్లిగా నీకే ఓ ఉద్యోగం అవసరం- ఆలోచించి తీసుకున్న నా నిర్ణయం సరయినది కాదనగలవా నిర్మలా- నో- నాకు తెలుసు కాదనలేవు।-

'నిర్మలా— చివరిగా నీకు తెలియని విషయం మరొక్కటి కూడా వుంది. నిన్ను- నిన్నుగా అనాటి బట్టలకొట్టు గుమాస్తాగా కాదు నేటి డిప్యూటీ జనరల్ మానేజర్‌గా-నేటికీ ఒంటరివాడయిన ఈ కృష్ణగోపాల్ ఇష్టపడుతూనే వుంటాడు- దాన్ని ప్రేమంటారో- ఏమంటారో తెలియదు కానీ-నిన్ను- నిన్ను ఇష్టపడుతూనే వుంటాడు ఎప్పటికీ। - నీ సుఖం- మేలు- కోరుకుంటాడు ఎన్నటికీ...' •